★ కీర్తి తెరల మాటున ★

రాధ వుత్తరం వ్రాసుకుంటున్నదల్లా తలెత్తి చూసింది తన ఎదురుగా కూర్చున్నావిడ వంక. ఆవిడ ఏదో ఇంగ్లీషు మేగజైను శ్రద్ధగా చదువుతోంది. ఎక్కడో చూసిన మొహంలా వుందే, అనుకుంది రాధ. కానీ ఎంతసేపు ఆలోచించినా జ్ఞాపకం రాక, విసుగుపుట్టి మళ్ళీ వుత్తరం వ్రాయడం మొదలెట్టింది. చెవులు బద్దలయ్యేలా వినిపించిన 'కనేడిషన్ ఇంజన్' కూతకి వులిక్కిపడి, గడియారం చూసుకుంది రాధ.

నైజాంబండికి యింకా మూడున్నర గంటల వ్యవధి వుంది. రాధ ఎదురుగా కూర్చున్నావిడ ఎఱ్ఱగా, కుదిమట్టంగా వుంది. ఆవిడకూడా రాధవంక ఓమాటు చూసి తల వంచుకుని మేగజైను చదవడంలో నిమగ్నురాలైంది.

సెకండుక్లాసు వెయిటింగురూం అంతా గందరగోళంగా వుంది. ఈదురుగాలికి తలుపులు, లైట్లు అన్నీ కదులుతున్నాయి 'టప్'మని ఏదో పడిన చప్పుడికి రెండు టేబిలు ప్రక్కన కూర్చున యిద్దరూ తలెత్తిచూశారు. బల్లమీది పత్రిక ఒకటి గాలికిఎగిరి, యిద్దరికీ మధ్యగా పడింది. రాధ వంగబోయింది దాన్ని తీద్దామని కానీ ఆ రెండో ఆవిడ కూడా వంగడంవల్ల తాను లేచింది. ఆవిడ కూడా అదేసమయంలో రాధ తీస్తుందేమో అన్న ఉద్దేశ్యంతో చాచిన చెయ్యి వెనక్కి లాక్కుంది. ఇద్దరూ తీయలేదు మళ్ళీ యిద్దరూ వంగారు. రాధ నవ్వింది ఆవిడ వంక చూసి ఆవిడా నవ్వింది. పత్రిక రాధే పైన పెట్టింది.

"ఎందాక" అన్న పలకరింపులతో ప్రారంభమైంది సంభాషణ. రాధ హైదరాబాదు వెడుతోంది. ఆ రెండో ఆవిడ కంచి వెడుతోంది మద్రాసు మెయిలు తప్పిపోవడంవల్ల, మర్నాటి ఎక్స్‌ప్రెస్ వరకూ వుండాలామె బెజవాడలో.

"మీముఖం ఎక్కడో చూసినట్లుగా వుందండీ." అన్నది రాధ ఆవిడతో.

ఆవిడనవ్వింది. "రేడియో పత్రికలో నా ఫోటో చూసివుండవచ్చు మీరు. నా పేరు మాలిని"

వెంటనే అవగతమైంది రాధకి. ఆ ప్రసిద్ధ గాయకురాలు మాలిని!

రాధ మనస్సు ఆనందంతో నిండింది. "మీరే కాదూ! ఔను. నాకు జ్ఞాపకముంది. మీపాటవిని, నేనెంతగానో మైమరచిపోతాను. ఎంత తియ్యనికంఠమండీ మీది!" అన్నది రాధ పట్టలేక. మాలిని నవ్వింది.

"మరి మీ సంగతి చెప్పారుకాదు!" అన్నది ఆమె రాధవంక పరీక్షగా చూస్తూ. రాధ సిగ్గుపడింది. కానీ వెంటనే బల్ల మీద వున్న పత్రిక తీసి, కొన్ని పేజీలు తిప్పి, మాలిని ముందుంచింది "ఆ కథ వ్రాసింది నేనే" అన్నదామె

రాధాదేవి! మాలినికూడా చకితురాలైంది. ప్రసిద్ధ కథకురాలు రాధాదేవి యీవిడేనా? మాలిని రాధని ఎన్నివిధాలో అభినందించింది నిత్యం తను అభిమానంతో చదివే కథలన్నీ రాధవే అని తెలుసుకుని మాలిని ఎంతో ఆనందించింది - సాక్షాత్తు ఆవిడ పరిచయమే కలిగినందుకు.

ఇద్దరూ ఆనందంతో మాట్లాడుకోసాగారు. గాయకుల్ని గురించి, కథారచయితల్ని

ఎమ్. జానకీరాణి

గురించి, త్యాగరాజుని గురించి. విలియం షేక్స్పియరుని గురించి మాటాడారు వారు. ఇద్దరూ కలిసి వెళ్ళి కాఫీ త్రాగి వచ్చారు రైల్వే కాంటీనులో.

వెయిటింగురూంకి తిరిగి వచ్చేస్తుంటే రాధ అన్నది. "నిజంగా యిది చాలాసుదినం మాలినిగారూ. ఇంత మధురగాయనిని నేను స్వయంగా కలుసుకుంటానని ఎన్నడూ అనుకోలేదు అతిశయోక్తి, ముఖస్తుతి కాదనుకుంటే నేనోమాట చెబుతాను. కోయిల కంఠంలోని మాధుర్యం స్ఫురిస్తుంది నాకు మీకంఠంలో."

మాలిని వెంటనే అన్నది, రాధచేతిని తన చేతులోకి తీసుకుని. "సరిగ్గా నేనూ అదే అనబోతున్నాను. ఇవాళ్ళ నిజంగా సుదినం. మీలాంటి రచయిత్రిని కలుసుకోగలుతాననీ, అందులో మీరే నన్ను స్వయంగా అభినందిస్తారని నేనూ ఎన్నడూ వూహించుకోలేను. మీరు నన్ను మర్చిపోకుండావుంటే అదే చాలు." అన్నదామె. "ఎంతమాట!" అన్నది చిరునవ్వుతో రాధ. ఇంకోగంటే వ్యవధివుంది రాధకి.

ఇద్దరికీ మనస్సులో విచారంగానే వుంది విడిపోతున్నందుకు. ఒకరికొకరు అద్భుతంగా, అసమానంగా కనుపించారు. రాధ తన చిరునామా యిచ్చింది మాలినికి ఎప్పుడూ వుత్తరాలు వ్రాసుకోవాలన్నది మాలిని. ఇంకో అరగంట వుందనగా రైలు ఎక్కింది రాధ. మాలినికూడా ఆమెతోపాటు వెళ్ళి ఒంటవ తరగతి కంపార్టుమెంటులో కూర్చుంది.

"నిజంగా రాధాదేవీ! మీరిన్ని కథలు ఎలా వ్రాస్తారో నాకర్థంకాదు. ఆడవాళ్ళల్లో మీ అంత గొప్ప రచయితలు ఎవరూ లేరనిపిస్తుంది నాకొక్కొక్కప్పుడు. ఈనాడు నేను ప్రయాణం చేయకపోతే ఈ జన్మకు మీ పరిచయభాగ్యం కలిగేది కాదు నాకు" అన్నది మాలిని.

రాధ నవ్వింది "అలాకాదు. ఆ గాలి విసురుగా రాకపోతే, ఆ పుస్తకం క్రింద పడకపోతే మనకి పరిచయం కలిగేదికాదు. మనము ఆ యీదురుగాలికి కృతజ్ఞులమై వుండాలి" అన్నదామె.

ఈ విధంగా పరస్పర అభినందనలతో కాలం గడిచింది. చివరికి భారంగా రైలు బెజవాడ విడిచింది రాధని తీసుకుని. మాలిని తన ప్రఖ్యాతి స్నేహితురాలిని తల్చుకుంటూ గడిపింది ఆ రాత్రి ఆస్టేషనులో.

ఆ తర్వాత వారంరోజులకే రాధ వ్రాసింది మాలినికి తన యోగక్షేమాల్ని గురించి. లేఖాపరంపర సాగింది రెండు నెలలపాటు. రాధ కావ్యాల్లాంటి వుత్తరాలు వ్రాసేది. ఏవేవో కలలు, వూహలు, సుందర వర్ణనలు వుండేవి ఆమె లేఖల్లో. మాలిని కంఠం ఎన్నిమార్లో శ్రావ్యంగా వినిపించింది 'ఆకాశవాణిలో'. నా హృదయాన్ని కదలివేస్తుంది మీ సంగీతం. నన్ను తీయని బాధలో ముంచివేస్తుంది మీ కంఠ మాధుర్యం" అని వ్రాసేది రాధ. ఒకరి కుటుంబాలనిగురించి ఒకరు తెలుసుకున్నారు. ఏవేవో విషయాలు వ్రాసుకున్నారు ఒకరికొకరు ఆంతరంగికురాండ్రయ్యారు వుత్తరాలద్వారానే.

మాలిని అట్టే భాగ్యవంతురాలు కాదు. ఆమెభర్త చిన్నగుమాస్తా ఒక ఆఫీసులో. ఆమె సంపాదనే ఎక్కువ అతని జీతం కంటే. ఆ సంగతి రాధ త్వరలోనే తెలుసుకుంది.

ఓమాటు వుత్తరంలో రాధ ఒక విచిత్ర ప్రస్తావన తెచ్చింది. "మీకంచిలో పట్టుచీరలు

కీర్తి తెరల మాటున

కాగా చవుకట కాదా?" అని. పోనీ, కావాలంటే పంపుతానని వ్రాసింది మాలిని మిత్రురాలికి. "రేపే నేను మనియార్డరు పంపుతున్నాను 50 రూపాయలు" అని వ్రాసింది రాధ. అది అందేలోగానే ఉదారంగు పట్టు చీర కొని పార్శిలులో పంపింది మాలిని. కానీ నెలగడిచినా ఆ మనియార్డరు రాలేదు, రాధదగ్గర్నుంచి జాబు లేదు. మాలిని మనస్సు అదోలా అయిపోయింది.

నిజానికి ఆ ఖర్చు విషయంలో ఆమె భర్తతో ఘర్షణపడింది. పిల్లల బట్టలకోసం దాచినసొమ్ము, భాగ్యవంతురాలైన స్నేహితురాలిమీద మోజుకొద్దీ వాడేసింది. పదిరోజుల అనంతరం ఆ చీర పంపినందుకు కృతజ్ఞత తెలుపుతూ, ఎమ్. ఓ. అందిందని ఆశిస్తున్నానంటూ రాధ వ్రాసింది.

కానీ—ఏమౌతుంది పంపిన మనియార్డరు? కొంచెం ఆలస్యమైనా ఎప్పటికో అప్పటికి అందాలికదా? అందలేదని వ్రాద్దామంటే నామోషీ వేసింది మాలినికి నిజంగా పంపిందా రాధ? మాలిని మనస్సులో అనుమానం తోచింది. పంపివుండదు అసలు. అప్రయత్నంగా, క్రమంగా మాలినికి యిదివరలో కలిగిన సదభిప్రాయం సడలిపోయింది. ఒక 50 రూపాయలకోసం...ఛీ! అబద్ధం ఆడింది రాధ. పైగా పదిరోజుల తర్వాతనా కనుక్కోవడం? శ్రీమంతురాలై వుండి, 50 రూపాయలకోసం లోభత్వం చూపించింది. పోనీ, డబ్బు యివ్వడానికి యిష్టంలేకపోతే, ఆ చీర బహుమానంగా తీసుకున్నానని వ్రాయరాదూ?

మాలిని మనస్సు విరిగిపోయింది. ఇదివరకటి మైత్రిఅంతా మంచులా కరిగిపోయింది. ఆమె రాధకి యిదివరకులా వ్రాయలేకపోయింది. "మేమంతా క్షేమం మీ క్షేమం తెలుపవలసింది" అన్న పద్ధతిలో కార్డులు వ్రాయడం మొదలెట్టింది.

హైదరాబాదులో వున్న రాధ ఆ వుదారంగు పట్టుచీరె ధరించింది ఎన్నిసార్లో. మాలినికి మనియార్డరు పంపుదామనుకుంటుండగానే ఆ చీర వచ్చింది. అదో బహుమానం కావచ్చు అనుకుంది ఆమె. డబ్బు పంపేశానని వ్రాసింది, మాలిని ఏమంటుందో చూద్దామని. ఏమీ అనకపోయేసరికి, 'ప్రేమపూర్వక బహుమానం' అని పేరుపెట్టేసి, ఆ చీరని స్వీకరించింది. ఆ తర్వాత ఆమెకి డబ్బు పంపాలనిపించలేదు. ఆ సంగతి మాలినికి తెలిపే ధైర్యం లేకపోయింది ఆమెకి.

ఒకనాడు తన మిత్రురాలు, మద్రాసునుంచి వచ్చినావిడని కలుసుకుంది రాధ. మాటలసందర్భంలో మాలిని తన స్నేహితురాలని చెప్పింది రాధ.

ఆ రెండో ఆవిడ కళ్లు చిట్లించింది. "అదా? అది మీ ఫ్రెండేమిటి?"

రాధ నిర్ఘాంతపోయింది యీ అగౌరవ సంబోధనకి "అదేమిటండీ అల్లా అంటారు?" అన్నదామె ఆశ్చర్యపోతూ.

"సరే, నాకే చెప్పాలా? దాన్ని మర్యాదచేయమంటారా?" అంటూ ఆమె ఎన్నో గాథలు చెప్పుకొచ్చింది మాలినిని గురించి. రాధ మనస్సు వికలమైపోయింది. ఇవన్నీ చెప్పినావిడని పదిసంవత్సరాలుగా ఎరుగుంది రాధ. ఆమె అనవసరంగా ఒకర్ని గురించి అనే మనిషి కాదు. నమ్మక తప్పలేదు రాధకి. నిజమే నేమో! మాలినిని గురించి తనకేం తెలుసు వ్యక్తిగతంగా ఛీ! అలాంటి మనిషా యీ మధురగాయకురాలు? మనస్ఫూర్తిగా వ్రాయలేకపోయింది రాధ వుత్తరాలు.

అల్లా సన్నగిల్లింది వారి మైత్రి, కార్డులు కూడా వ్రాసుకోని స్థితికివచ్చారు వారు. ఒక సంవత్సరం గడిచింది...

ఒకనాడు రాత్రి 8.30 కి బెజవాడ రైలు స్టేషనులో, రెండోతరగతి వెయిటింగు రూంలో కుండ్రని బల్లదగ్గర - మాలిని కూర్చుని చదువుకుంటోంది. కళ్లుమంటలుగా వుండి, ఒక్కక్షణం కళ్లుమూసుకుందిఆమె

రాధ—ప్రవేశించింది. వెయిటింగు రూంలోకి. మాలినినిచూసి, ఒక్కక్షణం ఆగింది. గతమంతా తలపుకి వచ్చింది. ఏమని పలుకరించాలి యీవిడ్ని? మాట్లాడడానికి మనస్సు ఒప్పలేదు ఆమెకి. నిశ్శబ్దంగా అబల్లముందు కూర్చుని, బేగ్ లోంచి కార్డుతీసి వుత్తరం వ్రాయసాగింది. మాలిని కళ్లుతెరచిచూసింది. రాధ! డబ్బు విషయంలో ఆనాడు పైత్యం చూపించినావిడ!

ఇద్దరూ ఒకేమాటు ఒకరివంక ఒకరు చూసుకున్నారు. ప్రయత్నపూర్వకంగా నవ్వింది రాధ. నీరసంగా నవ్వింది మాలిని.

"ఓహో! కులాసానా?" అన్నది రాధ.
"ఆ ఆ. మీరు? ఎందాకా వెడుతున్నారు!" అన్నది మాలిని.

అరగంట టైముంది మాలినికి. ఒక పది నిముషాలసేపు అర్థంలేని, పేలవమైన సంభాషణ మాలినితో గావించిన తర్వాత ఆమె లేచింది.

"వస్తానండి మరి. బొత్తిగా వ్రాయడం మానేశారేం వుత్తరాలు" అన్నది యథాలాపంగా.

"ఏమిటోనండి, ఖర్చులెక్కువైపోయి, కవరు కొనడానికికూడా పిసినారితనం చూపిస్తున్నారు మావారు. అదీ కాక మిత్రులికి కానుకలు, బహుమానాలు ఎక్కువైపోయాయి యీ పిల్లిళ్ల 'సీజన్'తో" అన్నది మాలిని. బలే దెబ్బకొట్టాను అనుకున్నది.

రాధం ముఖం ఎఱ్ఱబడింది "ఆహా! అల్లాగా! నేను ఏదన్నా పనివుండి తీరటంలేదేమో అనుకున్నాను" అన్నదామె ఇదిమరీ ముఖంమాడ్చేట్టుగా వుంది అనుకుంది రాధ.

నమస్కారాలతో విడిపడ్డారిద్దరూ. ఆక్షణంలో—ఒక ప్రఖ్యాత కథకురాలికి వీడ్కోలిస్తున్నానని మాలినీ అనుకోలేదు; ఒక మధురగాయనిని విడిచి పెడుతున్నానని రాధా అనుకోలేదు.

★

దేశసౌభాగ్యానికి జాతీయ ప్రోత్సాహము ఎంతో అవసరం.

అలాగే ఆంధ్రాభ్యుదయానికి ఆంధ్ర సంస్థలను ఆంధ్రులు ప్రోత్సహించుటకూడా చాలా అవసరం.

ఎల్లవేళలా మీఆరోగ్య రక్షణకు వలయు సమస్తమందులను సరసమైన ధరలకు విక్రయించు ఏకైక

ఆంధ్ర సంస్థ

స్వామి సన్స్

మందుల వ్యాపారులు

అబీద్ రోడ్డు, హైదరాబాదు, (దక్కన్.) ఫోన్: 5498